

ఆక్యుపెన్సీ పత్రం పరిశీలించాక అనుమతులు

ప్రజాశక్తి -నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమతుల మేరకే భవన నిర్మాణాలు జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో పర్యవేక్షించాలని, ఆక్యూ పెన్సి సర్టిఫికెట్ ను పరిశీలించాకే ఇతర విభాగాలు అనుమతులు మంజూరు చేయాలని కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. జిల్లా వైద్య శాఖ అధికారి, విద్యుత్, ఫైర్, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి, ఇంజనీ రింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధి.కారులతో కమిషనర్ ఛాంబర్ లో బుధవారం సమీక్ష నిర్వహించారు.

కమిషనర్ మాట్లాడుతూ నగం´పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం సూచించిన నిర్మాణ నిబంధనల మేరకు, అనుమతించిన వరకు మాత్రమే ఎలాంటి నిర్మాణాలైనా చేపట్టాలని సూచించారు. డి.ఎం. హెచ్.ఓ డాక్టర్ సుజాత, నగం´పాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఎస్.ఈ రామ్మోహన్ రావు, విద్యుత్ విభాగం ఈ.ఈ శ్రీధర్, ఫైర్ డిపార్ట్మెంట్ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ డిసిపి పద్మజ, అధికారులు ప్రకాష్, వేణు పాల్గొన్నారు.

మాటలేనా..చర్యలుండేనా...!

నుడా పరిధిలో అక్రమ లేఅవుట్స్ రోజు రోజుకు పుట్టుకొస్తునే ఉన్నాయి...తిమ్మిని బమ్మిని చేసి రియల్టర్లు వ్యాపారులు సాగిస్తూనే ఉన్నారు. "కాకి అరుస్తోంది...కరవాడి ఎండిపోతుంది." అన్న సామెతలా వైసిపి ప్రభుత్వం నుంచి అక్రమ లేఅవుట్స్‌పై వ్యవహారం అలానే ఉంది. అప్పట్లో నుడా చైర్మన్ ముక్కాల ద్వారాకానాథ్ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆక్రమణదారులకు నోటీసులిచ్చారు. పట్టించుకున్న నాధుడే లేరు. అల్లీపురంలో ఇరిగేషన్ కాలువలు ఆక్రమించి ప్లాట్స్ వేశారని, తొలగించాలని స్వయంగా కలెక్టర్ ఆదేశాలిచ్చినా బుట్టదాఖలు చేశారు. ఇప్పుడు మళ్లీ నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇదే విషయమై హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రియల్టర్లను భయపెట్టడానికా..? అక్రమ లేఅవుట్స్ తొలగించడానికా..? ఎందుకో తెలీదు గాని ఇక్కడ ఇళ్ల పాట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు మాత్రం గగ్గోలు పెడుతున్నారు..

-రియల్టర్లలో ఆందోళన
-265 అక్రమ లే అవుట్స్ గుర్తింపు
-వైసిపి ప్రభుత్వం నుంచే గగ్గోలు

ఆక్రమణ భూముల్లో ప్లాట్లు వేసిన దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అక్రమ లేఅవుట్స్ వ్యవహారం ఆప్పటి వైసిపి, ఇప్పటి టిడిపి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని ఇష్టానుసారంగా లేఅవుట్స్ వేశారు. నుడాకు రావాల్సిన ఆదాయానికి కొందరు అధికారులు గండికొట్టారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం నుడా పరిధిలోని 38 మండలాల్లో 265 అక్రమ లేఅవుట్స్‌ను నుడా అధికారులు గుర్తించినట్లు చెబుతున్నారు. ఇది ఇప్పటిది కాదు. వైసిపి ప్రభుత్వం నుడా ఛైర్మన్‌గా ముక్కాల ద్వారకానాధ్ ఉన్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ఈ వ్యవహారంపై లేఖ రాశారు. అధికారులు నోటీసులు జారీ చేశారు. లేఅవుట్స్ తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలు ప్రకారం వ్యాపారాలు చేసుకుంటే అభ్యంతరాలు లేవు. అడ్డదారిలో, అడ్డగోలుగా నుడా నిబంధనలు కాకుండా, తమకు ఇష్టం వచ్చినట్లు అనేక మంది రియాల్టర్లు వ్యవహరించారు. అప్పుడప్పుడు నాయకులు, అధికారులు బెదిరించడం మళ్లీ సర్దుబాట్లు చేసుకోవడం పరిపాటిగా మారిపోయింది. సాధారణ, మధ్యతరగతి, ఉద్యోగులు సొంత ఇంటి కోసం అప్పులు చేసి, వడ్డీలకు తెచ్చుకొని ఇంటి స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ఇప్పుడు అవి అక్రమ లేవుట్స్ అంటూ నాయకులు, అధికారులు చెబుతున్నారు. అప్పుడు ఎందుకు నిఘా పెట్టడం లేదు. ఇప్పుడు ఎందుకు గగ్గోలు పెడుతున్నారో అర్థం కావడం లేదు. అప్పుడు పనిచేసిన అధికారులు, ప్రస్తుతం చేస్తున్న అధికారులు చేతివాటంతో పెద్ద ఎత్తున అక్రమ లేఅవుట్స్ వచ్చాయనే విషయం తెలిసిందే. కలెక్టర్ల ఉత్తర్వులు నుడాలో పనిచేయడం లేదు. అల్లీపురం వద్ద ఇరిగేషన్ స్థలం ఆరెకరాలు అక్రమించి లేఅవుట్స్ వేశారు. కలెక్టర్ చక్రధర్‌బాబు విచారించి నుడా, మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పుడు అక్కడ పక్కా భవనాలు నిర్మాణాలు జరిగిపోయాయి. కొనుగోలు చేసిన వారు రోజూ ఆందోళనలు చెందుతున్నారు. జిల్లా వ్యాపితంగా పెద్దఎత్తున ఇలాంటి వ్యవహారాలే సాగాయి. ఇప్పుడు నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి తొలగిస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వాస్తవంగా చేస్తారా లేదా బెదిరింపులతో భయపెడతారా చూడాలి....

265 అక్రమ లే అవుట్స్ గుర్తింపు..!

నుడా పరిధిలో అధికారులు 38 మండలాల పరిధిలో 265 అనధికార లేఅవుట్స్‌ను గుర్తించారు. వీటి విస్తీరణ 1278 ఎకరాలు. పంచాయతీ పరిధిలో 187, మున్సిపాలిటీ పరిధిలో 79 వరకు ఉన్నాయి. 2016 యాక్ట్ ప్రకారం అందరికీ నోటీసులు పంపనున్నారు. పంచాయతీలకు, పంచాయతీ సెక్రటరీలకు, డిపిఐ, మున్సిపల్ కమిషనర్, మున్సిపాలిటీలకు నుడా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తొలుత నోటీసులు అంటిస్తారు. అనధికార లేఅవుట్స్‌కు వెళ్లి రాళ్లు తొలగిస్తారు. పెన్సింగ్ తీసేస్తారు. ఇందుకోసం రెండు ఎన్‌ఫోర్సు మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. నుడా అధికారుల లెక్కల ప్రకారం కోవూరు 34, నెల్లూరులో 32, కావలి 63, ఆత్మకూరు 32, కందుకూరు 26, ఉదయగిరి 33, సర్వేపల్లి 36, సైదాపురంలో 13 లేఅవుట్స్ ఉన్నట్లు గుర్తించారు. రియల్టర్లు అప్పుడు వైసిపికి, ఇప్పుడు టిడిపికి సహకరిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే కొందరు ఎంఎల్‌ఎలను కలిసినట్లు తెలిసింది. అధికార పార్టీ ఎంఎల్‌ఎలు, నేతలను కాదని కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఏ మేరకు తొలగిస్తారో చూడాలి.. రియల్టర్లు, రాజకీయ నేతల మధ్య ఇక్కడ ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు మాత్రం లబోదిబో అంటున్నారు. ఏం జరుగుతుందో చూడాలి..

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

తోటపల్లిగూడూరు మండలం నరకూరు సెంటర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ కరపత్రాలు నరకూరు సెంటర్లో పంచి, అనంతరం సిఐటియు ఆఫీసులో ఆవిష్కరించారు.నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ సిపిఎం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి 1, 2, 3 తేదీలలో నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం (అపోలో హాస్పిటల్ ఎదురుగా)లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రధాన నాయకత్వం పాల్గొనే ఈ సభలలో కార్మిక హక్కుల యొక్క స్థితిగతులపై కూడా చర్చ జరపనున్నారని రాజా తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో మోడీ సారధ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులైన అధాని, అంబానీలను ప్రపంచంలోనే పెద్ద ధనవంతులను చేస్తూ కార్మికులను రైతులను బికారులను చేస్తోందని ఆయన విమర్శించారు. నరుకూరు సెంటర్ఆటో యూనియన్ కార్యదర్శి గోపి, ట్రెజరర్ ఎన్. శివ, గణేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు

సబ్ కలెక్టర్ శ్రీపూజ చేతుల ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని బుధవారం అవిష్కరించారు. కందుకూరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, యస్. విజయభాస్కర్ , పొడపాటి చంద్రయ్య, సబ్ కలెక్టర్ కార్యాలయం డివిజినల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ టి. శ్రీనివాసరావు, రెవిన్యూ అసోసియేషన్ డివిజనల్ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ప్రజాశక్తి -నెల్లూరు : జిల్లాను కుష్టు రహిత జిల్లాగా చేయడానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను అదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని శంకరన్ హాలులో ఆయన వైద్యాధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వ హించారు. బుధవారం నిర్వహించిన ఈ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమం పోస్టర్, పాంప్లేట్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు 14 రోజులపాటు ఇంటింటా సర్వే చేయాలని, ప్రజలలో శాస్త్రీయమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వి సుజాత అడిషనల్ డిఎం అండ్‌హెచ్ ఓ ఖాదర్ వలీ, జెడ్ సీఈవో విద్యారమ, మెప్మా పి డి రాధమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుశీల, ఆశా కోఆర్డినేటర్ మంజులమ్మ ,డిప్యూటీ డిఈఓ లక్ష్మి ప్రసన్న, డెమో అధికారి కనకరత్నం ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అదాని కృష్ణపట్నం పోర్టుకు అవార్డు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :అదాని కృష్ణపట్నం పోర్టుకు ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ కు ప్లాటినం కేటగిరీ కింద సేవా రంగంలో జాతీయ స్థాయి 18వ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసిసి) ఎన్విరాన్‌మెంట్ ఎక్సలెన్స్ అవార్డు 2024ని అందుకుంది. పరిశ్రమలు, వాణిజ్యం, పరిశ్రమలు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ మహిళా, శిశు అభి వృద్ధి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ శశిపంజా పర్యావరణ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి రోష్నిసేన్‌కు అవార్డు, మెమెంటో, ధ్రువీకరణ పత్రాన్ని బుధవారం అందజేశారు. కోల్‌కతాలోని తాజ్ బెంగాల్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో అదాని కృష్ణపట్నం పోర్టు హెడ్ డ్రై కార్గో ఆపరేషన్స్ మిస్టర్ విజయ్ రాథోడ్ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు సుస్థిరత, పర్యావరణ ఆవిష్కరణ, బాధ్యతాయుతమైన వ్యాపార విధానాల పట్ల ఎకేపీఎల్ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనమన్నారు.. ఎకెపిఎల్ పర్యావరణ నిర్వహణలో బెంచ్‌మార్క్‌లను నెలకొల్పడం ద్వారా పర్యావరణ పనితీరును ప్రదర్శిస్తోందన్నారు.

జ్వరాల నివారణకు సర్వే

గుడ్లూరు రూరల్ :మండలంలోని గ్రామాల్లో ప్రతి ఇంటిని సర్వే చేసి జ్వరాలు ఉన్న వారిని గుర్తించి వారికి మందులు, వారి ఇంటి దగ్గర ఇవ్వాలని అవసరమైన వారిని చికిత్స కోసం తరలించాలని, జ్వరాలు వ్యాప్తి చెంద కుండా పంచాయతీ సిబ్బంది తో కలిసి శానిటేషన్ చర్యలు చేపట్టాలన్నారు. డాక్టర్ మారుతీ రావు .భాస్కరరావు, ఆరిఫ్ ఉన్నారు.

15వ డివిజన్‌లో సిపిఎం ప్రచారం

ప్రజాశక్తి -నెల్లూరు :ఫిబ్రవరి 1 ,2, 3 తేదీల్లో నగరంలో జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలును విజయవంతం చేయాలని కోరుతూ 15వ డివిజన్ సిపిఎం శాఖా సభ్యులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఆ డివిజన్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రజా సమస్యలపై సిపిఎం చేస్తున్న పోరాటాలు, సాధించిన విజయాలు వివారించారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ బాలాజీ నగర్ లో విరాళాల సేకరించారు.సిపిఎం నగర కమిటీ కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, 15వ డివిజన్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు అల్లం పాటు శ్రీనివాసన రెడ్డి, పి సూర్యనారాయణ, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

'పర్వతనేని' రాజీనామా పొలిటికల్ డ్రామా

ప్రజాశక్తి -నెల్లూరు :ఆరోగ్యం సహకరించడం లేదని, రెండు పదవులకు న్యాయం చేయలేనని 2 నెలల కిందటే రెడ్ క్రాస్ కు రాజీనామా చేయాలని భావించానని చెబుతున్న చంద్రశేఖర్ రెడ్డి మంత్రి నారాయణ ను లక్ష్యంగా చేసుకోవడం పొలిటికల్ స్టంట్ మాత్రమే అని తెలుగుయువత నెల్లూరు పార్లమెంటు అధ్యక్షులు కాకర్ల. తిరుమల నాయుడు ఎద్దేవా చేశారు. బుధవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెడ్ క్రాస్ ఎన్నికలలో మనోహర్ రెడ్డి ప్యానెల్ గెలిస్తే అడ్డగోలుగా ఛైర్మన్ గా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఎన్నికయ్యారన్నారని ఆరోపించారు. తెలుగుయువత నేతలు లేకిన్ రెడ్డి, ప్రవీణ్, మోపూరు సాయి కిరణ్, గాదంశెట్టి హేమంత్, రఫీ, శివా రెడ్డి, నాని పాల్గొన్నారు.

పలుచోట్ల పొలం పిలుస్తోంది..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ :గుడ్లూరు మండలంలోని రావూరు , సాలిపేట, పోట్లూరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి బి. రవికుమార్ అధ్య క్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా రవికుమార్ వరిలో కలుపు నివారణ గురించి వివరించారు. వ్యవసాయ లాభసాటిగా ఉండేందుకు రైతులకు పలు సూచనలు చేశారు.రామకృష్ణ, వ్యవసాయ,ఉద్యాన సహాయకులు, రైతులు ఉన్నారు.

తోటపల్లిగూడూరు :మండలంలోని తోటపల్లిగూడూరు బిట్ వన్, ఈదురు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఎంఎఓ వివి శిరీష రాణి మాట్లాడారు. రైతులు, ప్రజా ప్రతినిధులు, విబబలు వినిల్, స్వాతి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు:కందుకూరు మండలంలో జి మేకపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది మండల జివ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో బుధవారం జరిగినది. రాము మాట్లాడుతూ పొగాకు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు అయిన శనగ, నువ్వు,మినుము, పెసర,ధనియాలు ఇతర పంటలు వేసుకోవాలని సూచించారు.కోవూరు పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్ సుధాకర్ ,జి.మేకపాడు సర్పంచ్ గూడపాటి. బ్రహ్మయ్య మాట్లాడారు. గ్రామ వ్యవసాయ సహాయకులు టీ.రోశి రెడ్డి పశు సంవర్ధక సహాయకారి సి హెచ్.ప్రసాదు ఉన్నారు.

బైక్ మెకానిక్స్‌కు అండగా ఉంటాం..!

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలోని ఇస్లాంపేట, షాదీఖానా నందు కందుకూరు బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. మెకానికల్ సంక్షేమానికి తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు.బైక్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే ప్రతి కార్యక్రమానికి తన మద్దతు ఉంటుందని మీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తమ వద్దకు రావచ్చని తెలిపారు.బైక్ మెకానిక్స్ అసోసియేషన్ కుటుంబ సభ్యులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాల రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు .పట్టణంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసే సందర్భంలో బైక్ మెకానిక్స్ సభ్యులు ఎవరికైనా ఇళ్ల స్థలం లేకుండా అర్హులైన వారికి తప్పనిసరిగా ఇంటి పట్టాలు మంజూరు చేసే విధంగా కషి చేస్తానని బైక్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులకు హామీ ఇచ్చారు.ో కందుకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాంబ బు, లేబర్ ఆఫీసర్ మేరీ సుజాత, రాష్ట్ర టూపర్ అసోసియేషన్ అధ్యక్షులు డి ధర్మా, కందుకూరు పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు బైక్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు

అక్రమ లే అవుట్స్ తొలగిస్తాం..

తప్పు చేస్తే భయపడాలి : కోటంరెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

అనధికార లేఅవుట్ల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని.. ఇప్పటికే అనధికారంగా ఉన్నవాటిని గుర్తించి.. చర్యలకు ఆదేశించినట్లు నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు.. 8 నియోజకవర్గాల్లోని 38 మండలాలలో 265 అనధికార లేఅవుట్స్‌ను గుర్తించామని స్పష్టం చేశారు.. వాటిని డెమోలిష్ చేసేందుకు ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో వైసిపి చోటా మోటా నేతల సహకారంతో ఇబ్బడి ముబ్బడిగా లేఅవుట్లను ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. మంత్రి నారాయణ సూచనల మేరకు.. వాటిపై ఉక్కు పాదం మోపుతున్నట్లు వెల్లడించారు.. ఆటోనగర్లోని నుడా కార్యాలయంలో బుధవారం కోటంరెడ్డి మీడియాతో మాట్లాడారు.. నుడా అనుమతులు లేకుండా అనధికారంగా లేఅవుట్ లు వేయాలంటేనే భయపడేలా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.. రాష్ట్రంలోనే నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని బెస్ట్‌గా తీర్చిదిద్దేందుకు కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.. నుడాకు ఆర్థిక వనరులు సమకూర్చడంతో పాటు.. ప్రజలకు అన్ని అను మతులతో కూడిన ప్లాట్లు ఉండేలా చూస్తున్నామన్నారు.. నుడాలో అనుభవజ్ఞులైన సీనియర్ అధికారులు ఉన్నారని.. వారి సహకారంతో మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి లే అవుట్లు వేసిన వారిపై కఠిన చర్యలతో పాటు.. భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు.. నుడా అనుమతులను సుల భతరం చేశామని.. ఎవరు అనధికారికంగా లేఅవుట్లు వేయొద్దన్నారు.

మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి : మేయర్

ప్రజాశక్తి -నెల్లూరు

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను కనబరుస్తూ సరికొత్త ఆవిష్కరణలతో దేశాభివద్ధికి కషి చేయాలని నగర మేయర్ స్రవంతి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని టౌన్ హాల్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువజన ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ స్రవంతి మాట్లాడుతూ యువతలోని ప్రతిభా పాఠవాలను వెలికితీయడం, వారి నైపుణ్యాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాలనేది ఈ యువజన ఉత్సవాల ప్రధాన ఉద్దేశంగా ఆమె చెప్పారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపాలన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్ విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్య, ఉద్యోగం మాత్రమే కాకుండా స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని సమాజహితం కోసం, దేశాభివృద్ధి కోసం పాటుపడాలన్నారు.జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి మహేంద్రరెడ్డి మాట్లాడారు. అనంతరం సైన్స్ మేళా, మొబైల్ ఫోటోగ్రఫీ, యువ రచయితల పోటీలు, డ్రాయింగ్, సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సెట్నల్ సిఇవో నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ సైన్సు అధికారి కరుణాకర్‌రెడ్డి, వ్యవసాయశాఖ జేడీ సత్యవాణి, ఎంఇవో హమీద్, నవజీవన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

ఎపి పాలిటెక్ ఫెస్ట్ 2024-25లో

'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ డిప్లొమా విద్యార్థులు "నేచురల్ అండ్ మల్టీపర్పస్ సస్టైనబుల్ కోల్డ్ స్టోరేజ్" అనే ప్రాజెక్ట్‌తో రాష్ట్రస్థాయి ఎపి పాలిటెక్ ఫెస్ట్ 2024-25లో తమ ప్రతిభను ప్రదర్శించారు. డాక్టర్ ఎం. లక్ష్మణ్ రావు ,అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. సంపత్ కుమార్ మార్గదర్శకత్వంలో రూపొందించిన ఈ ప్రాజెక్ట్ విశేష ప్రశంసలను అందుకుంది. కాలేజ్ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య విద్యార్థులు , మార్గదర్శకుల కృషిని ప్రశంసించారు. ఈ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రివర్యులు నారా లోకేష్ ప్రశంసలు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు.కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డా. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థుల్లో సజనాత్మకత , ఆవిష్కరణను పెంపొందించేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉండి, విద్యా రంగంలో ఉత్తమ ప్రమాణాలను నెలకొల్పుతుంది అని పేర్కొన్నారు.రాష్ట్రస్థాయిలో విశేష ప్రతిభ చూపిన విద్యార్థుల ఈ విజయాన్ని కళాశాల గర్వంగా భావిస్తున్నట్లుగా ప్రిన్సిపల్ వి.హరిబాబు పేర్కొన్నారు.ఈ విజయాన్ని పురస్కరించుకుని, అభినందన కార్యక్రమం నిర్వహించారు. డిప్లొమా ప్రిన్సిపాల్ వి. హరిబాబు, ఆర్అండ్‌డి డీన్ డా. ఎం. లక్ష్మణ్ రావు, మెకానికల్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సంపత్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న కంచర్ల రామయ్య

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు

ప్రజాశక్తి -నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ సూర్య తేజ సిబ్బందిని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం స్థానిక బివి నగర్ కేఎన్ఆర్ పాఠశాల రోడ్డు, లెప్రసీ హాస్పిటల్ రోడ్డు, 22/1 మదర్ తెరిసా సచివాలయం పరిసర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. స్థానిక బాయ్స్ హాస్టల్ ను తనిఖీ చేసి వంటశాలలోని భోజనాన్ని తిని చూసారు. విధుల నిర్వహణలో మరింత శ్రద్ధ వహించాలని హాస్టల్ నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరిం గ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

'టిఆర్ఆర్'లో ఆర్ఐఓ పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను నెల్లూరు జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఏ. శ్రీనివాసులు బుధవారం పరిశీలించాచరు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడుతూ కళాశాలకు కందుకూరులో మంచి పేరు ఉందని ఆ పేరును మంచి ఫలితాలు తీసుకొని వచ్చి కళాశాల గొప్పతనాన్ని కందుకూరు చుట్టుపక్కల ప్రాంతం వారికి తెలిసేలా చేయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో అండర్ 19 స్కూల్ గేమ్స్ శ్రీకాకుళంలో జరిగినవి ఇందులో థర్డ్ ప్లేస్ సాధించిన బాస్కెట్బాల్ క్రీడాకారులను ఆర్ఐఓ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ షేక్ నాగూర్ వలి,పిడి సుబ్బారావు, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలియజేశారు

మద్యం మత్తులో దాడి

బాలుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మద్యం మత్తులో దాడికి పాల్పడ్డ ఘటనలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డ ఉదంతమిది. ఈ దాడిపై పోలీ సులకు అందిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. మండలంలోని ఇస్కపాలెం పంచా యతీ కోదండరామపురం గ్రామానికి చెందిన నెల్లిపూడి శ్రీకాంత్ బాలుడిపై అదే ప్రాంతానికి చెందిన తుపాకుల కిషోర్ అనే యువకుడు మద్యం మత్తులో దాడి చేశాడు. ఈ దాడిలో బాలుడు శ్రీకాంత్ తలపై తీవ్ర గా యాలయ్యాయి. గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం నెల్లూరు ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. ఈ మేరకు బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు కిషోర్ గతంలో కూడా మద్యం మత్తులో దాడులకు పాల్పడిన ట్లు తెలిసింది. దాంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తమ బిడ్డపై దాడి చేసిన నిందితుడు కిషోర్ పై పోలీసులు కఠిన చర్యలు తీసకోవాలని కు టుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

కిశోర బాలికల వికాసంపై సదస్సు

ప్రజాశక్తి -గుడ్లూరు : కిశోర బాలికల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కషి చేయాలని ఐ సి డి ఎస్ సిడిపిఓ అరుణ పేర్కొన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో కిషోర్ బాలికలు, బాలురు వికాసం పై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. సమా జంలో ఉన్న అవ లక్షణాలను తొలగిస్తూ సమాజాన్ని సరైన మార్గంలో నడిపేందుకు వీలుగా బాలికలు అభివద్ధి చెందేలా చూడాలని ఎంపిడిఓ వై వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సదస్సులో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు హాజరయ్యారు సిడిపిఓ వై వెంకటేశ్వరరావు ,సిఐ మంగారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు కామేశ్వరి లీలాంబరం సఖి స్టాఫ్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్రైస్తవ సంఘాలు హర్షం

ప్రజాశక్తి -నెల్లూరు :అమెరికన్ బాప్టిస్ట్ క్రైస్తవ మిషనరీ ఆస్తులు అన్యాక్రాం తం చేయరాదని మద్రాస్ హైకోర్టు చెప్పిన తీర్పును స్వాగతిస్తున్నట్లు క్రైస్తవ ఆస్తుల పరిరక్షణ కమిటీ బుధవారం ఒక ప్రకటనలోతెలిపింది. గత 35 సంవత్సరాలుగా సిఎస్ నెంబర్ 124/94 కేసులో వాదోపవాదాలు విన్న మీదట పిఎ బి సి , (ఏబీ ఎం కాంపౌండ్) కావలి వారు అక్రమంగా ఆస్తులు అన్యాక్రాంతం చేశారని ఎస్టీ బీసీ కి గాని పి ఏ బి సి కి గాని ఆస్తులు అమ్మే అధికారం లేదని హైకోర్టు తీర్పు ద్వారా తెలియసిందని తెలిపారు.

క్రీడా విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు :నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల్లో కందుకూరు టీ.ఆర్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అథెలిటిక్స్ లో విజయం సాధించారు. 2024-25 సంవత్సరంనకు నెల్లూరు పట్టణం లో నిర్వహించిన యూత్ గేమ్స్ లో భాగంగా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రతిభ సాధించారు.అశ్వని షాట్ పుట్ లో ప్రథమ స్థానమునూ హరిత తతీయ స్థానం సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం రవికుమార్ , వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర ఏడుకొండలు ,కళాశాల ఫిజికల్ డైరక్టర్ కెఆర్ కరుణ కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

చిరు ధాన్యాల బిస్కెట్లపై

క్షేత్ర స్థాయి పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం గహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి. నీహారిక పలుకూరు గ్రామంలో బియ్యం తౌడు, చిరు ధాన్యాలతో తయారు చేసిన బిస్కట్లు పై వినియోగదారుల అంగీకారంపై బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఇందులో బాగంగా చిరు ధాన్యాలు (రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు, అరికలు, సామలు)లో పీచు పదార్థాలు, బి-కాంప్లెక్స్ విటమిన్లు, కనిజాలు (క్యాల్షియం, ఇరాన్, జింక) బియ్యం, గోధుమలు కన్నా అధికంగా ఉంటాయని తెలిపారు. మేలైన ఆరోగ్యానికి ధీటైన చిరునామా ఈ చిరు ధాన్యాలు అన్నారు. రోజు వారి ఆహారంలో చిరు ధాన్యాలను తీసుకోవడం వలన పోషకాహార లోపం , వివిధ ఆరోగ్య సమస్యలు మలబద్ధకం, ఊబకాయం, మధుమేహం, కీల నొప్పులు, రక్తహీనత, రక్తపోటు, గుండ జబ్బులు, క్యాన్సర్లు రాకుండా అరికట్టవచ్చు అను తెలిపారు.

నిబంధనల మేరకు పని చేయాలి

ప్రజాశక్తి - నెల్లూరు

రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు ఐ ఆర్ సి ఎస్ నిబంధనల ప్రకారం పని చెయ్యాలని కలెక్టర్, మేనేజింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఒ.ఆనంద్ సభ్యులకు సూచించారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మేనేజింగ్ కమిటీ సభ్యులు తటస్థంగా,నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.అలా కాకుండా కొంత మంది రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొంటూ నిబంధ నలను ఉల్లంఘిస్తున్నట్లు స్టేట్ కమిటీ నుండి లేఖలు వచ్చాయన్నారు.కనుక నిబంధనలు ఉల్లంఘించ వద్దని కోరారు.రెడ్‌క్రాస్ సొసైటీలో ఉన్నంతవరకు ఏ రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని చెప్పారు డిఆర్‌వో జె ఉదయభాస్కర్‌రావు, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : గుడ్లూరు మండలం పూరేటిపల్లి గ్రామానికి చెందిన ఒంగోలు రామకష్ణ(47) అనే రైతు మంగళవారం పొలం దున్నుతూ గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ రైతు పత్తి గింజలు నాటేందుకు తన పొలం ఎద్దులతో దున్నుతున్న క్రమంలో హఠాత్తుగా గుండెపోటుకు గురైమృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అతనికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నాట్లు తెలిసింది. దీంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సైన్స్ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని కట్టుబడిపాలెం హైస్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌ను ఎఎంఒ సుధీర్ బాబు బుధవారం ప్రారంభించారు. స్మైల్ ఫౌండేషన్, షెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ ల్యాబ్ కోసం సుమారు రెండు లక్షల వ్యయం, ఖర్చు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంత విద్యార్థులతో సమానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా సైన్స్ జ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశాన్ని అధునాతన పరికరాలు ద్వారా స్మైల్ ఫౌండేషన్ కల్పించడం ఎంతో అభినందనీయమని, ఉపాధ్యాయులు విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మరింత మెరుగైన సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. స్మైల్ ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ విజయసారథి మాట్లాడుతూ స్మైల్ ఫౌండేషన్, షెల్ ఇండియా విద్యార్థులకు అందిస్తున్న శాస్త్ర విజ్ఞాన సహకారాన్ని వివరించారు. పిల్లల్లో దాగివున్న శాస్త్ర నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఈ ఎస్.ఎక్స్.కార్నర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రధానోపాధ్యాయులు బి.వి. సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు గాడి వంశీ చరణ్, స్మైల్ ఫౌండేషన్ ఫెసిలిటేటర్స్, జోష్నవి, సుభహాని, మురళి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూటమి నాయకుల కష్టంతోనే విజయం

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరుడెస్క్ : తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టమే 2024 ఎన్నికల్లో తమను గెలిపించిందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తమ గెలుపును వారి భుజాలపై మోసి విజయతీరాలకు చేర్చారని గుర్తు చేశారు. బుధవారం ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలతో వింజమూరు సమీపంలోని ఎస్‌వి కళ్యాణ మండపం ఆత్మీయ సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షులు, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఎనిమిది మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను ఎంపిగా, కాకర్ల సురేష్ ఎంఎల్‌ఎగా ఉన్నామంటే కారణం నాయకులు, కార్యకర్తలేనని, వారి శ్రమ వృథా కాలేదన్నారు. ఎంపిగా టికెట్ ఇచ్చి తనను ప్రోత్సహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎంఎల్‌ఎలు వంటేరు వేణుగోపాల్, కంభం విజయరామిరెడ్డి, జెడ్‌పి మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, వంశీధర్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని రేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని తొమ్మిది ప్రాథమిక పాఠశాలలను 3వ తేదీ నుండి 8వ తేదీ వరకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అల్లంపాటి వెంకటేశ్వర రెడ్డి తనిఖీలు చేశారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులందరినీ చదవడం, రాయడం, ఉక్తలేఖనం, గణిత ప్రక్రియలను పరీక్షించిన అనంతరం ప్రతి పాఠశాల ఇన్‌ఫ్రా స్ట్రక్చర్, విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా గూగుల్ షీట్ ఆన్‌లైన్‌లో నింపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలియజేశారు. వీరన్నట్ల ఎస్.సి ప్రాథమిక పాఠశాలను విజిట్ చేశారు. హెచ్‌ఎంలు వృద్ధియోయిన వెంకటేశ్వర్ల రెడ్డి, సి.ఆర్.పి. పోలయ్య పాల్గొన్నారు.

ఎంఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-ఉదయగిరి : పదవ తరగతి విద్యార్థుల 100 రోజుల యాక్షన్ ప్లాన్ ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు బుధవారం తనిఖీ చేశారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను గడ్డంవారిపల్లి, కృష్ణంపల్లి పాఠశాలలలో అమలు అవుతున్న ఎస్ఎస్‌సి 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు తీరును ఆయన పరిశీలించారు. స్లిప్ టెస్ట్ మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేయించాలని స్టాఫ్‌కు సూచించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు, స్టాఫ్‌కు ఎంతో ప్రేరణ, ఉత్సాహాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.మాలకొండయ్య, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర కళాశాల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా ఆత్మకూరు జోన్ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్ కుమార్, కళాశాల పిడి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక దారుఢ్యాన్ని, మానసిక వికాసాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. తొలి రోజు జరిగిన సెమీఫైనల్ పోటీల్లో ఎస్‌వికె కళాశాలపై ఎంఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉదయగిరి జట్టు, ఆత్మకూరు ఎవిఎ డిగ్రీ కళాశాల జట్టుపై డాక్టర్ ఎన్ఆర్‌జె డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఫైనల్ పోటీలు గురువారం జరుగుతాయని పిడి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.శ్రీనివాసులురెడ్డి, రమణయ్య, మధుసూదన్ రెడ్డి, అంకమ్మ, వెంగళరావు, వెన్నెళశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని ఉమ్మాయి పల్లెలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా పాల్గొని రాష్ట్ర, దేశస్థాయిలో ప్రతిభ చాటితే ప్రభుత్వ ఉద్యోగం పొందడంలో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. అలాగే క్రీడలతో యువతలో స్నేహపూరక వాతావరణం ఏర్పడటంతో క్రీడల ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రీడలు కేవలం శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయని తెలిపారు.

'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-కొడవలూరు : రైతులందరూ పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారిణి సిహెచ్‌ఎస్ లక్ష్మి అన్నారు. ఆమె బుధవారం మండలంలోని యల్లాయపాలెం పంచాయతీలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎఇఒ పి.వెంకట్రావు, వివిఎ జి.ఉమామహేష్, సొసైటీ సిఇఒ జి.వంశీకృష్ణ, నాయకులు వై.వంశీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని గుంపర్లపాడు, వెల్లులరుగుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి బి.రజని నిర్వహించారు. ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.దేవసేనమ్మ రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఇఒ చిరంజీవి, వివిఎ జి.హేమంత్, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకలు అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు : సాహో ఫౌండేషన్ మర్రిపాడు వారి ఆధ్వర్యంలో మండలంలోని తల్లి లేదా తండ్రి లేని ఇద్దరులేని 190మంది విద్యార్థులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. పదవ తరగతిలో మండలంలో ఉత్తమ ఫలితాలను సాధించిన పదిమంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల నగదు పంతున మెరిట్ స్కాలర్‌షిప్, ఉన్నత విద్య అభ్యసిస్తున్న ఇద్దరు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, క్రీడలు, చదువులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పడవల నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులకు తమవంతు సహకారాన్ని అందించాలనే ఉద్దేశంతో సాహో ఫౌండేషన్ ను ఏర్పాటు చేసామన్నారు. ఎంఇఒ ధనలక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, టిడిపి కన్వీనర్ జనార్దన్ నాయుడు, చిత్రాల ఎంఇఒ జొన్నా సత్యనారాయణ, సెంచరీ ప్లైవుడ్స్ కంపెనీ ప్రతినిధులు రమేష్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, రమణ, సాహో ఫౌండేషన్ సభ్యులు సునీతా రాణి, సుబ్బారావు, రమేష్, రాజేంద్రకుమార్, రమణయ్య, గంగాధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దొంతిరెడ్డి సోదరులకు అభినందనలు

ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరులో 6 సంవత్సరాల క్రితం వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమాని దొంతిరెడ్డి జయసింహారెడ్డి, వాసుదేవ రెడ్డి సొంతంగా పొలంలోనే దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫొటోలతోఆలయం నిర్మించారు. బుధవారం తాడేపల్లిలో జిల్లా నేతల సమావేశం సందర్భంగా గుడి విషయం మాజీ సిఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన ఉదయగిరి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఆయనతో మేకపాటి ఆలయానికి సంబంధించిన గుడి ఫొటో ఆల్బమ్ ఫొటోలను చూసి దొంతిరెడ్డి జయసింహారెడ్డి, వాసుదేవ రెడ్డిలను అభినందించినట్లు తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయురాలికి సత్కారం

ప్రజాశక్తి-కావలి : తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో 8, 9 తేదీలలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో కావలి నుండి విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలిశెట్టి జమున పర్యావరణ పరిరక్షణపై కవిత చదివి వినిపించారు. ఈ సందర్భంగా సభ నిర్వాహకులు ప్రసాద్ జ్ఞాపిక, సర్టిఫికెట్ సత్కరించారు.

'విపిఆర్' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-నెల్లూరుడెస్క్

ప్రజాసేవే ధ్యేయంగా జిల్లాలో విపిఆర్ ఫౌండేషన్ తరపున అమలు చేస్తున్నట్లు అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రశంసనీయమని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎన్నికల్లో వికలాంగులు పడుతున్న అవస్థలకు పరిష్కారంగా బుధవారం వింజమూరులో నిర్వహించిన ట్రై సైకిళ్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్, ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అందరితో సమానంగా విభిన్న ప్రతిభావంతులు జీవితంలో ఎదిగేందుకు వారికి మొబిలిటీ అతి ముఖ్యమన్నారు. అప్పుడే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకు అవసరమైన ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందజేయడం సంతోషకరమన్నారు. ఈ ఎలక్ట్రిక్ సైకిళ్ల ద్వారా 20 నుండి 25 కిమీ వరకు వెళ్లగలిగే సౌలభ్యం ఉన్నందున, వారి జీవనోపాధికి ఊతమిస్తాయన్నారు. విపిఆర్ ఫౌండేషన్ సమాజ అవసరాలకు అనుగుణంగా విస్తృత

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మైన సేవలు అందిస్తున్నారని, వారికి జిల్లా యంత్రాంగం సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా సేవే పరమార్థంగా 10 సంవత్సరాల క్రితం విపిఆర్ ఫౌండేషన్‌ను స్థాపించినట్లు తెలిపారు. అప్పటినుండి సమాజంలోని పేదవర్గాలకు వివిధ స్థాయిల్లో విద్య, మంచినీటి వసతి తదితర సేవలందిస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 150కి పైగా ఆర్ఒ ప్లాంట్లను నిర్మించామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఉదయగిరి నియోజకవర్గంలో ఎక్కువమంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించామని, అందుకే మొదటగా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించామన్నారు. మొత్తం 140మంది లబ్ధిదారులకు ట్రైసైకిళ్లు అందిస్తున్నామన్నారు. ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ మాట్లాడుతూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఆశీర్వదించిన నియోజకవర్గ ప్రజలకు అవసరమైన అన్నిసేవలు అందిస్తామన్నారు. అడిగిన వెంటనే 35 ఆర్ఒ ప్లాంట్లను మంజూరు చేసిన విపిఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలోని 8మండలాల పేద ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వేల కోట్ల ఆస్తిపాస్తులు ఉన్నప్పటికీ సహాయం చేసే గుణం కొందరికే ఉంటుందని, అటువంటి మంచి మనసున్న వ్యక్తి పార్లమెంట్ సభ్యులుగా ఉండటం జిల్లా ప్రజల అదృష్టమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాజీ జెడ్‌పి ఛైర్మన్ చంచలబాబు యాదవ్, నాయకులు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-వెంకటాచలం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే సిపిఎం పార్టీ 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నేత చంద్ర రాజగోపాల్ పిలుపునిచ్చారు. పొదలకూరు పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన పొదలకూరు మండల కమిటీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంపై నిరంతరం పోరాటాలు చేసే పార్టీ సిపిఎం అని తెలియజేశారు. జిల్లాలోని అనేక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, మధ్యతరగతి ఉద్యోగుల సమస్యలపైన అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. సోమశిల హై లెవెల్ కెనాల్ పూర్తి చేయాలని, దెబ్బతిన్న ఆఫ్రాన్ పనులను వెంటనే మరమ్మత్తులు చేయాలని, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు నిర్వహించారు. ఈ తరుణంలో సిపిఎం రాష్ట్ర మహాసభలు నెల్లూరు నగరంలో జరుగుచున్నాయని, ఫిబ్రవరి 3వ తేదీన భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. సిపిఎం ఆల్ ఇండియా నాయకులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు. మూడో తేదీ జరిగే బహిరంగ సభలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనాలని కోరుతున్నామన్నారు. మహాసభల జయప్రదానికి ప్రతిఒక్కరూ సహకరించి తోడ్పాటు అందించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.పెంచల నరసయ్య, మండల నాయకులు బి.మనోహర్, రంగయ్య, జి.మనీ, యానాదిరెడ్డి, పాండు, పెంచలయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

అంగన్‌వాడీలను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి బిట్రగుంట

అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. బోగోలు మండలం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్, మినీ హెల్పర్స్ 50 సంవత్సరాలు స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య, మండల సిపిఐ నాయకుడు చల్ల నరహరి మాట్లాడుతూ 1975లో భారతదేశంలో 2800 మందితో ఐసిడిఎస్ అంగన్‌వాడీ వర్కర్స్ ప్రారంభమైందని 1995 అక్టోబర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఆలిండియా సిఐటియు వర్కర్స్ యూనియన్‌లో కలిసినట్లు తెలిపారు. నాడు 2800 మంది వర్కర్స్‌తో ప్రారంభమైన అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్, నేడు 14లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పడి 28లక్షల మందికి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ కొనసాగుతుందని తెలిపారు. కానీ గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని, నేడు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం అయినా అంగన్‌వాడీ వర్కర్ల కష్టాన్ని గుర్తించి వారినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దాదాపు 50యేళ్లుగా కొనసాగుతున్న అంగన్‌వాడీ సిబ్బందిని వెంటనే ప్రభుత్వం పునరాలోచించి వారికి ఉదయత భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు సుభాషిణి, రజిత, పెంచలమ్మ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

రోశయ్య సేవలు మరువలేనివి..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

దివంగత సిపిఎం నాయకులు చంద్రగిరి రోశయ్య సేవలు మరువలేనివని సిపిఎం పట్టణ అధ్యక్షులు పోతంశెట్టి శ్రీనివాసులు కొనియాడారు. జొన్నవాడ సెంటంలో చంద్రగిరి రోశయ్య 17వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన స్థూపం దగ్గర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు నివాస స్థలాలు ఇప్పించేందుకు చంద్రగిరి రోశయ్య ఎంతోకృషి చేశారన్నారు. భూ పోరాటాల ఉద్యమంతో పాటు మరెన్నో ఉద్యమాలలో ఆయన పాత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో కూరగాయల మార్కెట్, షాదీ మంజిల్ నిర్మాణాలకు ఆయన విశేష కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు చంద్రగిరి రోశయ్యకు జోహార్‌లతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, ఎస్కె జానీ బాయ్, ఆగారా సుబ్బారావు, చెక్కా కిష్టయ్య, పలువురు సిపిఎం నాయకులు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అఫ్రాన్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి అనంతసాగరం

అఫ్రాన్ పనులు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సోమశిల జలాశయంలో అఫ్రాన్ పనులు త్వరగా పూర్తి చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జలాశయంలో జరిగిన ఆఫ్రాన్ పనులను సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సోమశిల జలాశయం ఆఫ్రాన్ పనులు పూర్తి చేస్తామని చెప్పి సోమశిల జలాశయంను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆఫ్రాన్ పనులలో ఎలాంటి అభివృద్ధి కనిపించడం లేదన్నారు. త్వరితగిన పనులు పూర్తి చేసి జలాశయంను అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. అలాగే గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్లను కొత్తరోడ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగళ పుల్లయ్య, సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా, మండల కమిటీ సభ్యులు ఉప్పలపాడు మస్తాన్, జక్రయ్య, నగులూరు వెంకటేష్, కమతం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న డాక్టర్ రమ్య

పట్టణంలోని బాపూజీ నగర్ బి.సి. బాలికల వసతి గృహంలో కావలి పట్టణ జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం అధ్యక్షులు తోట.వెంకటేశ్వర్లు అధ్యక్షతన విద్యార్థినులకు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సమస్యలు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలు, లైఫ్ స్కిల్స్, కెరియర్ గైడెన్స్ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ రమ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని, పర్యావరణాన్ని పరీక్షిస్తూ, లక్ష్య సాధనకోసం కృషి చేసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దిశానిర్దేశం చేశారు. జెవివి అధ్యక్షులు తోట. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థినులు ఎక్కువ సమయం సెల్ఫోన్లో గడుపుతూ సమాజానికి దూరమవుతున్నారని కావున పుస్తక పఠనం చేయాలని, కుటుంబంలో, సమాజంలో మానవ సంబంధాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా శాస్త్రవిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని, నిజం వైపు నడిచి, సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను పారద్రోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెవివి ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి.హరినాథ్, కోశాధికారి టి.సుబ్బరామ శర్మ, ముఖ్య అతిథులు డాక్టర్ రమ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, వార్డెన్లు నాగేశ్వరమ్మ, విజయలక్ష్మి, జిల్లా జెవివి ఉపాధ్యక్షులు పాపిశెట్టి జానకిరామ్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు జి.కళ్యాణి, ఉపాధ్యక్షులు ఎస్.కె. ఖాదర్‌భాషా, సంయుక్త కార్యదర్శులు సి.శారద, బండి.కోటిచలపతిరావు, గుణకల.శివయ్య, గాదిరెడ్డి. మురళీకృష్ణ, కె.జాన్, కార్యవర్గ సభ్యులు ఎం.వి.ఎన్. ప్రసాదరావు, సభ్యులు దామిశెట్టి.బాల సురేంద్రబాబు, గాదిరెడ్డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో నష్టాలు

ప్రజాశక్తి-కోవూరు

మాట్లాడుతున్న సిహెచ్ సుశీలాదేవి

తెలిసీ తెలియని వయసులో బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికల బంగారు భవిష్యత్తు పూర్తిగా ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందని, దానిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ బిడ్డలకు వివాహ వయస్సు వచ్చిన తర్వాతే పెళ్లి చేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్ సుశీలాదేవి అన్నారు. కోవూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కిశోర బాలికలకు సంబంధించి మండలస్థాయి అధికారులకు వైద్య ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని తెలియజేశారు. ముఖ్యంగా 11 నుంచి 18యేళ్ల వయస్సు గల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. తహశీల్దార్ నిర్మలానందబాబా, ఎంపిడిఒ శ్రీహరి, కోవూరు సిఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులకు సంబంధించి ఏ మైనా అత్యవసరమైన సలహాలు, సూచనలు కావాలంటే 112కు ఫోన్ చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మంచి అలవాట్లను చేసుకోవడమే కాకుండా పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్పే విషయాలపై అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం సుబ్బరాజు, ఎంఇఒ-2 చెంచులక్ష్మమ్మ, ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి, ఎస్ఐ రంగనాథ్ గౌడ్, జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాధిక, ప్రసన్న లక్ష్మి, ప్రమీల, శకుంతల, అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులున్నారు.

ప్రజల కోసమే పనిచేయాలి

ప్రజాశక్తి-విడవలూరు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

పార్టీలు వేరైనా ప్రజలచే ఎన్నికైన ప్రజాప్రతినిధులు ప్రజల కోసం పని చేయాలని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. విడవలూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై పాల్గొని మాట్లాడారు. అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు ఎంఎల్ఎకు ఘనస్వాగతం పలికారు. వ్యవసాయ, ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, రెవెన్యూ, హౌసింగ్ తదితర శాఖల అధికారులు మండల పరిధిలో అమలవుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ సహకార సొసైటీల ద్వారా చేసే యూరియా పంపిణీలో రైతుల పట్ల ఎటువంటి వివక్ష చూపొద్దని వ్యవసాయ అధికారులకు సూచించారు. గ్రామాలలో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. రోడ్లపై గుంతలు పూడ్చడంలో జరుగుతున్న జాప్యంపై పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారులను ప్రశ్నించారు. సకాలంలో రోడ్ల ప్యాచ్ వర్కులు పూర్తి చేసి సంక్రాంతి లోపు రోడ్లపై గుంతలు పూడ్చాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. మండల పరిధిలో రోడ్ల నిర్మాణానికి రూ.24కోట్లతో ప్రతిపాదనలు పంపి ఉన్నామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి పనిచేయాలని ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ఐదేళ్లలో స్థంభించిన గ్రామాభివృద్ధి ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఉపాధి హామీ నిధులతో రోడ్లు, డ్రెయిన్లు లాంటి మౌలిక సదుపాయాలతో గ్రామాలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. భూ ఆక్రమణల ఫిర్యాదులను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పక్కా గృహాల కేటాయింపులో గతంలో జరిగిన పొరపాట్లు సరిదిద్ది అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రైతులకు అత్యవసరం అయితే విపిఆర్ ఫౌండేషన్ ద్వారా సాగునీటి కాలువలలో పూడిక తీయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. అనంతరం వివిధ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందివ్వని అధికారులను తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి ఆవుల శ్రీనివాసులు, ఎంపిడిఒ నగేష్‌కుమారి, తహశీల్దార్ చంద్రశేఖర్, మండలంలోని ఎంపిపిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వెంకటసుబ్బయ్యను సన్మానించిన దృశ్యం

'ఉదయగిరి' ఫస్ట్ రావాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

విద్యాశాఖకు సంబంధించిన అన్ని విషయాలలో ఉదయగిరి మండలం మొదటి స్థానంలో ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డి.వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం స్థానిక విద్యాధికారి కార్యాలయ ఆవరణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దళితవాడ భవిత సెంటర్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఐఇఆర్‌టిలు సుభాష్ చంద్రబోస్, నందిత, హెచ్‌ఎం షేక్.షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణలను అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష డి.వెంకటసుబ్బయ్య అభినందించారు. ఎంఇఒ కార్యాలయాన్ని పరిశీలిస్తూ సిఆర్‌ఎంటిలకు, ఎంఐఎస్, డిటిఇఒ ఎంఇఒ-2 తోట శ్రీనివాసులుకు సూచనలు చేశారు. ముందుగా ఎంఇఒ కార్యాలయ సిబ్బంది, సిఆర్‌ఎంటిలు, పాఠశాల సిబ్బంది, ఎపిసిడి వెంకటసుబ్బయ్యను ఘనంగా సన్మానించారు.

బీద మనోజ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట : భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్ రావు కుమారుడు బిఎంఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ బీద మనోజ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ మేరకు ఆశ్రమంలోని వారికి బిఎంఆర్ యూత్ అధ్యక్షులు గోళ్ల మురళి, టీం సభ్యులు భోజనం, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చందు, నర్సయ్య, మోహన్, బన్నీ, రాఘవ, మహేష్, తదితరులు పాల్గొన్నారు. బిజ్జం రామిరెడ్డి, కోటమ్మ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు బిజ్జం రమణారెడ్డి ఆదరణ కేంద్రంలోని సభ్యులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో రమణారెడ్డి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ పొందాలి

ప్రజాశక్తి కోవూరు : బాలికలు ప్రాథమిక దశ నుంచి కరాటేపై ప్రత్యేక దృష్టి సారిస్తే అది వారికి ఆత్మ రక్షణగా ఉపయోగపడుతుందని ఇనమడుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధారాణి తెలిపారు. కోవూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు సమావేశ మందిరంలో కిశోరీ వికాసం కార్యక్రమం సందర్భంగా కరాటే గోల్డ్ మెడలిస్ట్ ముతహర్ ఆధ్వర్యంలో బాలికలకు కరాటేపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కరాటే పలు సందర్భాల్లో బాలికలకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ఈ ఆటపై బాలికలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ ఇటువంటి క్రీడలతో చిన్నారుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 వై.చెంచలక్ష్మమ్మ, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పిఇటి వెంకటసుబ్బమ్మ, కరీమున్నిసా, సూపర్‌వైజర్లు ప్రసన్నలక్ష్మి, ప్రమీల, శకుంతల, అంగన్‌వాడీలు, ఆయాలు ఉన్నారు.

మాజీ సిఎంతో నాయకుల భేటి

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



వైసిపి బలోపేతానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలో మండలంలోని వైసిపి ముఖ్య నేతలతో బుధవారం భేటీ అయ్యారు. మాజీ ఎంఎల్ఎ ప్రసన్నకుమార్ రెడ్డితో కలిసి మండలానికి చెందిన వైసిపి మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, జెడ్‌పి వైస్ ఛైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, మాజీ ఎంపిటిసి షేర్ కోట ప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తాజాగా నెలకున్న సమస్యలపై, పార్టీ బలోపేతానికి ప్రణాళికలు వంటి అంశాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలకు పెద్దపీట వేసే దిశగా వైసిపి ప్రభుత్వం అడుగులు వేయనున్నట్లు నేతలతో చర్చించారు.

దంతాలను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు

ప్రాథమిక దశ నుంచి చిన్నారులు దంతాలపై నిర్లక్ష్యం చేస్తే వాటి వలన అనారోగ్యబారిన పడే పరిస్థితి వస్తుందని, కావున వాటిని సంరక్షించుకోవాలని కొండారెడ్డి ఆస్పత్రి దంతవైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ సోనియా తెలియజేశారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం దంతవైద్యశాల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ప్రతిరోజూ తప్పనిసరిగా విద్యార్థులు రెండుసార్లు బ్రష్ చేసుకోవడమే కాకుండా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మరో 300మందికి పరీక్షలు నిర్వహించి పేస్టు, బ్రెష్లను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యూన్సీ రాణి, ఫిజికల్ డైరెక్టర్ దేవిక, పిఇటి వెంకటసుబ్బమ్మ, పిఆర్ఒ రాజశేఖర్, మేనేజర్ ప్రవీణ్, రేవతి ఉన్నారు.

'జెబి'కళాశాలలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-కావలి

జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సంబరాల సందర్భంగా బుధవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దాదాపు పది టీమ్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. విశ్వోదయ సంస్థల రెక్టార్ డి.వినయకుమార్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ, రంగవల్లులు అనేవి మన తెలుగు సంస్కృతి వారసత్వ చిహ్నాలని, వాటిని మనం కొనసాగించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను దొడ్ల లక్ష్మీ వినయకుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు ముగ్గుల ప్రాముఖ్యతను, సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

'విట్స్'లో సాంప్రదాయ దినోత్సవం

ప్రజాశక్తి-కావలి

విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సాంప్రదాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమం దేశం, రాష్ట్రం గొప్ప సాంస్కృతిక వారసత్వం, వైవిధ్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. అన్ని విభాగాల్లోని విద్యార్థులు ప్రత్యేక సాంప్రదాయాలను ప్రదర్శించడానికి ఉత్సాహంగా ముందుకు రావడంతో ఒక ఉత్సవ వాతావరణం నెలకొందని ప్రిన్సిపాల్ శేషయ్య తెలియజేశారు. కార్యక్రమంలో ఛైర్మన్ విద్యాధర రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూష రెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి లిఖిత్ రెడ్డి, పరిపాలన అధికారి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం నివాసులు ఎరియా హాస్పిటల్ పక్కనే ఉన్న అతిథి హోటల్ నిర్వాహకులు అర్వపల్లి నాగరాజ – సృజన దంపతుల కుమార్తె కుమారి అర్వపల్లి సులేఖ్య పుట్టినరోజు సందర్భంగా తుఫాన్ నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో పేదలకు దుప్పట్లు వితరణ చేశారు. దాత అర్వపల్లి నాగరాజ, వారి కుమార్తె అర్వపల్లి సులేఖ్య, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

ప్రజాశకి-ఎఎస్‌పేట

మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఎంపిడిఒ పి.ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండురోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇసి రవికుమార్, టిఎలు సతీష్, చంద్రశేఖర్, 19 పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.